


కృష్ణానదిలో నీట మునుగుతున్న నువ్వుల పంటను చూపిస్తున్న రైతు చిరంజీవి

నీట మునుగుతున్న పంటలు


నువ్వుల పంటలోకి చేరిన కృష్ణానది వరద జలాలు

పెంట్లవెల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో సాగుచేసిన పంటలు కళ్లముందే నీట మునుగుతుంటే రైతులు కన్నీరు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్ మొదటి వారంలోనే కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదిలో నీటి ప్రవాహం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ప్రవాహంతో నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం, వేంకల్, మంచాలకట్ట, జటప్రోలు గ్రామాల పరిధిలోని కృష్ణానదిలో సాగుచేసిన నువ్వు పంట నీట మునుగుతోంది. తొందరపడి పంటను కోసిన కొందరు రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఎగువ ప్రాంతానికి తరలిస్తున్నారు. కానీ చాలా మంది రైతులు పంటలు కోయలేదు. కళ్లముందే పంట నీట మునగడం చూస్తూ.. పంట సాగుకోసం చేసిన అప్పు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోసిన పంటను ఎగువ ప్రాంతానికి తరలిస్తున్న రైతులు


కృష్ణానదిలో కోసిన నువ్వు పంట కుప్పలు

సర్కారు దవాఖానలో..
మందుల కరువు

- ఇబ్బందులో షుగర్ బాధితులు
- అనస్థీషియా, గైనిక్ మందులు లేక ఇబ్బందులు
- మందులు కావాలంటే ప్రైవేట్‌లో కొనాల్సిందే
- ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్న అధికారులు


గద్వాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

గద్వాల క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా జనరల్ ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి రోగులు చికిత్స కోసం రోజూ వందల సంఖ్యలో వస్తుంటారు. వారికి మందులు లేకపోవడంతో ప్రైవేట్ మెడికల్ దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆసుపత్రిని కలెక్టర్ అప్పుడప్పుడు తనిఖీ చేస్తున్నా.. మందుల కొరత మాత్రం తీర్చడంలేదు. ఈ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న తర్వాత మందులను మళ్లీ బయటి దుకాణాలలో కొనాల్సిందే. మందులు ఇక్కడే ఉండాలి కదా అని ఎవరైనా అడిగుతే ఇక్కడ లేవు... మేమేమి చేయాలి అనే సమాధానం ఇస్తున్నారు.

అందుబాటులో లేని ఇన్సులిన్

గద్వాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం ప్రతీరోజు దాదాపు 700 నుంచి 800 మంది దాకా వస్తారు. ఇక సోమవారం అయితే దాదాపు 1,000 మందికి పైగానే వస్తుంటారు. వీరితో పాటు కొందరు వార్డులలో చికిత్సలు చేయించుకుంటూ ఉంటారు. వీరందరికి మందులు కావాల్సిందే. కానీ ఏవో కొన్ని మందులు మాత్రమే ఆసుపత్రి నుంచి ఇచ్చి మిగితావి బయటకు రాసి పంపుతున్నారు. పట్టించుకోవాల్సిన జిల్లా అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలో ఇన్సులిన్ కొరత తీవ్రంగా ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 26,141 మంది షుగర్ బాధితులు ఉన్నారు. వీరికి ప్రతీరోజు ఇక ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇన్సులిన్ లేకపోవడంతో బాధితులు పడే బాధలు వర్ణణాతీతం. వీటికి తోడు అనస్థీషియన్‌కు సంబంధించి, గైనిక్‌కు సంబంధించిన మందుల కొరత తీవ్రంగా ఉంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న కొందరు సిబ్బంది కమీషన్లకు కక్కుర్తిపడి రోగులను మెడికల్ దుకాణాలకు పంపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేగాకుండా మందులు సరఫరా చేసే సిబ్బందిలో కొందరికి మెడికల్ దుకాణాలు ఉండటం ఆరోపణలకు తావిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఇన్సులిన్ కొరత ఉంది



ఇన్సులిన్ కొరత రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. అలాగే అనస్థీషియా, గైనిక్ కు సంబంధించి మందుల కొరత కూడా ఉంది. అయినప్పటికి వీటిని ప్రస్తుతానికి ఇతర జిల్లాల నుంచి తెప్పించి పేషెంట్స్‌కు అందేలా చూస్తున్నాం. మందుల కొరతపై జిల్లా అధికారులు, డ్రగ్స్ కంట్రోల్ బోర్డుకు కూడా సమాచారం ఇచ్చాం. త్వరలోనే మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ఇందిర, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్


మాట్లాడుతున్న చిన్నారెడ్డి

సామాజిక న్యాయం
కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి
- ఘనంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సన్మాన సభ

7


శిక్షణ తరగతులలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

విద్వేషాలు, ఉద్రిక్తతలే
మోదీ ఆయుధాలు

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

7

గడువు ముగిసింది

● స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే సీజ్

- జిల్లాలో మొత్తం 241 స్కూల్ బస్సులు
- ఇప్పటి వరకు 166 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలల యాజమాన్యాలు


వనపర్తి రవాణా శాఖ కార్యాలయం వద్ద పాఠశాల బస్సు ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న డీటీవో మానస

వనపర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల కోసం రవాణా శాఖ అధికారులు ఇచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పాఠశాల యాజమాన్యాలు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఇప్పటికే పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగు రోజులు అవుతోంది. ఇంకా 30 శాతం మేర బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం కొన్ని పాఠశాలల బస్సులు కండిషన్‌లో లేకపోవడంతో వాటిని మరమ్మతు చేయిస్తున్నారు. ఆ బస్సులు మరమ్మతు చేయడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. కండిషన్‌లో లేని బస్సులను తూతూ మంత్రంగా మరమ్మతులు చేయిస్తే వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని, ఫిట్‌నెస్ ఉన్న బస్సులే రోడ్లపైకి వచ్చేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడానికి రవాణా శాఖ అధికారులు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చారు. వాస్తవానికి స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ మే 15వ తేదీన ముగిసింది. నాటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు నెల రోజుల గడువు పెంచారు. ప్రతీ సంవత్సరం పాఠశాల ల ప్రారంభం నేపథ్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న బస్సులను నడపాలని రవాణాశాఖ అధికారులు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 241 స్కూల్ బస్సులకు గాను, 166 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించారు. ఇంకా 75 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. పాఠశాలల యజమాన్యాలకు ఇచ్చిన గడువు ముగిసిందని, ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని బస్సులు నేటి నుంచి రోడ్డుపై తిప్పితే సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా గతంలో కాలం చెల్లిన బస్సులకు మరమ్మతులు చేయించి అధికారుల చేతులు తడిపితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. కానీ ఈసారి రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ బస్సుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కూడా కండిషన్ లేని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. దీంతో చాలా మంది పాఠశాలలో యజమాన్యాలు అయోమయంలో పడ్డారు.

అన్ని వర్గాల కోసం
ఎమ్మార్పీఎస్ పోరాటం

- కలుగొట్లలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి ఐజీ బీ. సుమతి

7

గృహ కార్మికులకు గుర్తింపేదీ..?

- దుర్భర స్థితిలో ఇంటి పనివారు
- అమలు కాని జీవో నెంబరు 60
- మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో అధికంగా గృహ కార్మికులు
- జూన్ 16వ తేదీన అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం



7

అంతర్జాతీయ స్థాయిలో
జిల్లాకు గుర్తింపు తేవాలి

- రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బీఎస్ ఆనంద్
- సౌత్‌ఆఫ్రికా టీసీఏ టీ-20 సీరీస్‌కు జిల్లా వాసి



క్రీడాకారుడు ఖయ్యుంను సన్మానిస్తున్న రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు

సంగమేశ్వరుడిని
చుట్టుముట్టిన వరద

● కృష్ణానది నీటిలో జలాధివాసం అవుతున్న ఆలయం



6

అంబేడ్కర్ ఆశయాలను సాధిస్తాం

- ● కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ
- ● పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


మొలచింతపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి అభిషేకం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి):గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను సాధిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొలచింతపల్లి, ముక్కిడిగుండం గ్రామాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు అభిషేకం చేసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా అందరికి సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

చారకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక అహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, నాయకులు ఉన్నారు.

నేనేంట్రా
ఇంత అందంగా ఉన్నాను..

క్లిక్.. క్లిక్..

మనుషులు అద్దంలో తమ ముఖాన్ని చూసుకుని మురిసిపోతుంటారు. అదే ఓ పక్షి చూసుకుంటే ఎలా ఫీలవుతుందో కదా! అదే ఇక్కడ జరిగింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత బజార్ పెట్రోల్ బంకు వద్ద శనివారం నిలిపి ఉన్న ఓ బైక్ సైడ్ అద్దంపై ఒక పిచ్చుక వచ్చి వాలింది. అద్దంలో తనను తాను చూసుకుంది. అక్కడ ఇంకో పక్షి ఉందనుకుందో.. అది తనే అనుకుందో తెలియదు కానీ.. అద్దంలో కొద్దిసేపు అలానే చూసింది. ఆ తర్వాత రెక్కలు విప్పి ఎగురుతూ ఏదో చెప్పడానికి ప్రయత్నించింది. అనంతరం చుంబిస్తున్నట్లు అద్దంపై తన ముక్కుతో కొట్టింది. ఈ అరుదైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి

వీడెవడ్రా అచ్చం నాలా ఉన్నాడు



ఆ.. వీడు ఎవడో కాదు.. నేనే..



అబ్బా.. ఎంత ముద్దొచ్చేస్తున్నానో..





మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

కార్మికుల హక్కులను

కాలరాస్తున్న ప్రభుత్వాలు

● హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నారాయణపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్ అన్నారు. టీయూసీఐ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా మొదటి మహాసభలను నిర్వహించారు. మహాసభల సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ మెయిన్ చౌరస్తా సరాఫ్ బజార్ మీదుగా ఎస్ఆర్ గార్డెన్ వరకు భారీ ఎత్తున కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఓ సమావేశంలో మాట్లాడుతూ నేను బీజేపీలో పాఠశాల, టీడీపీలో కళాశాల, కాంగ్రెస్‌లో ఉద్యోగం చేస్తున్నానని పేర్కొన్నారని గుర్తు చేశారు. అందుకేనేమో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు కూడా ప్రజా కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలే ఉన్నాయన్నారు. కార్మిక సంఘాల ఐక్యతను నిర్వీర్యం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను మార్చి కార్మిక సంఘాల అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మికుల హక్కుల కోసం, రక్షణ కోసం కనీస వేతనం రూ.26 వేలు అమలు కోసం, సకాలంలో వేతనాలు ఇవ్వడం కోసం, సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం కార్మికుల కర్తవ్యం కావాలని, అందుకే అన్నిరంగాల కార్మికులు ఐక్యంగా ముందుకు కదలాలన్నారు. సభలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, అడ్వకేట్ కాలేశ్వర్, యాదగిరి, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, పెద్దింటి రామకృష్ణ, కృష్ణ, నారాయణ, ప్రశాంత్ తదితరులున్నారు.

శ్రామిక పక్షపాతి మహాకవి శ్రీశ్రీ

● శ్రీశ్రీ సాహిత్యంపై సదస్సు - కవి సమ్మేళనం విజయవంతం


సదస్సులో మాట్లాడుతున్న బాదేపల్లి వెంకటయ్య

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల, శ్రామికుల పక్షాన నిర్భయంగా నిలిచి, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన శ్రామిక పక్షపాతి మహాకవి శ్రీశ్రీ అని వక్తలు డాక్టర్ పరిమళ్, బాదేపల్లి వెంకటయ్య గౌడ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీ సాహిత్యం - ప్రాసంగికత, 75 సంవత్సరాల మహాప్రస్థానంపై సదస్సులో వక్తలు, పలువురు కవులు, రచయితలు ప్రసంగించారు. సామాజిక దృక్పథంతో సామాన్యుల పక్షాన నిలిచిన అరుదైన కవి శ్రీశ్రీ అని కొనియాడారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం ఎందరినో కవులుగా మార్చి నూతన ఒరవడికి నాంది పలికిందన్నారు. యువతను జాగృతం చేసేందుకు శ్రీశ్రీ తన కవిత్వంలో కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు.. పావన జీవన బృందవన నిర్మాతలు అంటూ అభ్యుదయం వైపు నడిచిన యువతకు మార్గదర్శి అయ్యారన్నారు. తెలంగాణ సాహితి సలహాదారుడు తుమ్మల భాస్కరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన పలువురు కవులు కవితా గానంతో అలరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్, విద్యావేత్త సురభి జగపతి రావు, తెలంగాణ సాహితి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనద్దీన్, కొప్పోలు యాదయ్య, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల రీజియన్ కమిటీ ఎన్నిక


ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల మహబూబ్‌నగర్ రీజియన్ కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ రెహమాన్ సోఫీ, రాష్ట్ర అడిషనల్ కార్యదర్శి సత్యన్న ఆచారి, రాష్ట్ర కార్యదర్శి బసన్న ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. రీజియన్ అధ్యక్షుడిగా భాస్కరాచారి, ప్రధాన కార్యదర్శిగా సత్యశీలారెడ్డి, కోశాధికారిగా కే.కే.మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామ్మూర్తి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, చీఫ్ అడ్వయిజరుగా ఎంకే జోసెఫ్, జాయింట్ సెక్రటరీగా దమ్మాయపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని పలువురు ఘనంగా సన్మానించారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భాస్కరాచారి, సత్యశీలారెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని పది డిపోలకు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి: యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు కిష్టయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు ప్రతీ సంవత్సరం వేసవి సెలవుల్లో పదోన్నతులు కల్పిస్తామన్న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కిష్టయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 700 ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూల్‌లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. డీఈవో పోస్టులు చాలా వరకు ఇన్‌చార్జిలే ఉన్నారని, ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ 2023 నుంచి అమలు కావల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే వెలువరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు 101 పద్దుకింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, నర్సింహులు, కోశాధికారి భాస్కర్, నాయకులు మణ్యం, కిష్ట్యానాయక్, అజయ్, హేమంత్‌కుమార్, శివరాజు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


కార్యకర్తలతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

● ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయాన్ని స్థానిక నాయకులు మార్కెట్ చైర్మన్ హరలింగం, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత ఆదరణ కలిగిన మైసమ్మ తల్లి దయతోనే తాను పాదయాత్ర చేపట్టి ప్రజల మెప్పుతో ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. నాయకులు అంబదాసు, పుట్టి శ్రీనివాసులు, శంకర్‌నాయక్, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

వరద కాలువ మూసివేయడంపై..

హైకోర్టు తీర్పు హర్షణీయం

● ఇరిగేషన్ కాలువలు మూసే అధికారం ఎవరికీ లేదని ధర్మాసనం స్పష్టీకరణ

● ఇరిగేషన్ ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి


వరద కాలువలో వేసిన పైపులు


కోస్గి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వరద కాలువను మూసి రోడ్డుగా మార్చుకొని అధికారులు కాలువను మూయవద్దని చెబితే ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు మొదటి రోజు వాదనలు వింటూనే ఇరిగేషన్ కాలువ మూసే అధికారం ఎవరికీ లేదని కేసును కొట్టివేసిందని ఇరిగేషన్ ఏఈ పవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కోర్టు అందించిన ఆర్డర్ కాపీ ప్రతులను విలేకరులకు అందించి, మాట్లాడారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముశ్రీఫా గ్రామ శివారులోని మది గండ్లకుంట నుంచి వాగుకు వెళ్లే వరద కాలువను ఓ వ్యక్తి తన పొలానికి వెళ్లేందుకు రోడ్డు లేదని అలుగు కాలువలో పైపులు వేసి మూసివేశాడు. అలా చేయొద్దని, పైపులను తొలగించాలని పదేపదే చెబితే హైకోర్టును ఆశ్రయించి ఇరిగేషన్ అధికారులకు నోటీసులు పంపారన్నారు. తమ శాఖ న్యాయవాది ద్వారా తాము ఆ కాలువ ఎక్కడినుంచి ఎలా వస్తుంది, ఎక్కడికి పోతుందన్న పూర్తి ఆధారాలతో కోర్టుకు వివరించామన్నారు. మొదటి రోజు వాదనలతోనే వాయిదాలు లేకుండా ఇరిగేషన్ పాటుకాలువలు మూసే అధికారం ఎవరికీ లేదని, పైపులు మూసి యదావిధిగా కాలువను అలాగే ఉంచాలని కోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాలు హర్షణీయమని ఏఈ పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో కాలువను యదావిధిగా ఉంచుతామన్నారు. మండలంలో మరిన్ని పాటుకాలువలు మూసివేశారని వాటిని సైతం యదావిధిగా తీయిస్తామన్నారు.

క్రీడాకారుడిని సన్మానించిన ఎమ్మెల్యే


క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గద్వాలకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఖయ్యూం సౌత్‌ఆఫ్రికాలో జరిగే కౌంటింగ్ క్రికెట్‌కు ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి క్రీడాకారుడిని శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌత్‌ఆఫ్రికాలో మంచి క్రీడాప్రదర్శన చేసి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, గద్వాల ప్రాంతానికి, క్రీడారంగానికి మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, రిజ్వాన్, ఫయాజ్, క్రికెట్ కోచ్ శ్రీను, క్రీడాకారులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటగిరిలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ప్రతీ నెల శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని వెంకటగిరిలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఆలయ పూజారి మంత్రోర్చనలతో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ చోరీ

కోయిలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ చోరీకి గురైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయికొండ మండలం మోదీపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మైపాల్‌గౌడ్ శనివారం వ్యవసాయ పనులు ముగించుకొని గ్రామంలోని తమ కిరాణం డబ్బా వద్ద పెట్టగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ ఇంజన్‌ను ఎత్తుకెళ్లారు. కొన్ని రోజులుగా మండలంలో ట్రాక్టర్ బ్యాటరీలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్తున్నారని, కానీ టాక్టర్ ఇంజన్ ఎత్తుకెళ్లడం ఇదే మొదటిసారి అని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మైపాల్‌గౌడ్ తెలిపారు.


నీటిలోనే సంగమేశ్వరుడికి పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

సంగమేశ్వరుడిని చుట్టుముట్టిన

వరద జలాలు

● జలాధివాసం అవుతున్న సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కొల్లాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్త నదుల సంగమ క్షేత్రం సంగమేశ్వరం ఆలయాన్ని కృష్ణా జలాలు చుట్టుముట్టాయి. ఆదివారం ఆలయ ఆవరణలో వరద నీరు చేరడంతో పూజారి తెలకపల్లి రఘురామయ్య శర్మ చివరి రోజు మంగళ హారతి, ప్రత్యేక పూజలు చేశారు. మరో వారం రోజుల్లోపు వరద జలాలతో సంగమేశ్వరం ఆలయం పూర్తిగా జలధివాసం కానుందని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో వరద జలాలు చేరడంతో భక్తులు బోట్ల ద్వారా బయటికి వచ్చారు. భక్తులకు సంగమేశ్వరుడి దర్శనం మరో వారం రోజులు మాత్రమే ఉండనుంది.


సప్తనదుల సంగమక్షేత్రం సంగమేశ్వరం ఆలయాన్ని చుట్టుముట్టిన కృష్ణానది వరద జలాలు

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

పెద్దకొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రతీ ఆదివారం అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. మృగశిర కార్తె రావడంతో రైతులు కుటుంబ సభ్యులతో కలిసి మైసమ్మ తల్లి దేవతకు మొక్కులు తీర్చుకునేందుకు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నాకే ఆ మరుసటి రోజు నుంచి వ్యవసాయ పొలాల్లో విత్తనాలు విత్తడం సంప్రదాయంగా మొదలు పెడతారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాలతో భారీ ఎత్తున తరలి రావడంతో మైసమ్మ దేవతకు సమీపంలో కిలో మీటరు పొడవునా రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలు ఆగిపోవడంతో మైసమ్మ దేవత దర్శనం కోసం వచ్చిన భక్తులు పడరాని పాట్లు పడ్డారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి దాదాపు ఈ ఆదివారం 4వేల మందికి పైగా భక్తులు మైసమ్మను దర్శించుకొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు తాము కోరుకున్న కోరికలు నెరవేరాలని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల నుంచి టికెట్ల ద్వారా రూ.1,02,700, హుండీ ద్వారా రూ.1,96,216, మొత్తం రూ. 2,98,916 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.


అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న పెద్దకొత్తపల్లి ఎస్ఐ వీ సతీష్

సాయిచంద్ ఆశయాలను కొనసాగిస్తున్నాం

● రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని

● 29న సాయిచంద్ విగ్రహావిష్కరణ బహిరంగ సభ


మాట్లాడుతున్న రజిని

అమరచింత, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కళను, కళాకారులను ప్రోత్సహిస్తూ తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో ప్రజలను చైతన్య పరిచిన సాయిచంద్ ఆశయాలను భార్యగా తనతో పాటు ప్రతీ ఒక్కరు కొనసాగించాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 29న సాయిచంద్ వర్ధంతిని పురస్కరించుకుని అమరచింత బస్టాండ్ సెంటర్‌లో విగ్రహావిష్కరణతో పాటు హై స్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సభకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, పలువురు కళాకారులు విచ్చేయుచున్నట్లు ఆమె పేర్కొన్నారు. సాయిచంద్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. విగ్రహావిష్కరణ, బహిరంగసభ స్థలాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, నర్సింహగౌడ్, నాగభూషణంగౌడ్, జయసింహరెడ్డి, సుజందర్‌బాబు, లెనిన్, షానవాజ్, సత్యనారాయణ, గోపాల్ నాయక్, శేఖర్, తెలుగు రమేష్ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- గిరిజనాభివృద్ధి పథకంపై అవగాహన కల్పించిన అధికారులు

గట్టు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని వాయిలకుంట తండాలో గిరిజనాభివృద్ధి (ధర్తిఅభజన భాగీదారి అభియాన్) పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, గ్రామీణ రహదారుల అభివృద్ధిని సాధించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని గిరజనాభివృద్ధి శాఖ అధికారి వివరించారు. తండా వాసులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ అధికారి ఎం. పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన ఎల్లేని


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానించిన ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఎల్లేని సు ధాకర్‌రావు శాలువాతో సత్కరించారు. కిషన్‌రెడ్డి జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. అనంతరం కొల్లాపూర్ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కొల్లాపూర్ నియోజక వర్గంలో పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేసినందుకు కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేసి కొల్లాపూర్ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మంత్రిని కోరారు.

క్రైం కార్నర్

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి


తిరుపతయ్య(ఫైల్)

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మార్నింగ్ వాక్‌కు వెళ్లి, వెంట తీసుకెళ్లిన కుక్కను ఓ పక్కన కట్టేసి, చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని మినీట్యాంక్‌బండ్ (నల్ల చెరువు) వద్ద చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేటకు చెందిన న్యాయవాది, ట్యాక్స్ కన్సల్టెంట్ గుండు తిరుపతయ్య(55) ఆదివారం ఉదయం 6:30గంటలకు పెట్‌డాగ్‌తో సమీపంలోని మినీట్యాంక్‌బండ్‌కు వెళ్లాడు. పెట్‌డాగ్‌ను రేలింగ్‌కు కట్టేశాడు. అనంతరం మినీట్యాంక్‌బండ్‌లో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో తలకిందులుగా పడి మునిగిపోయాడు. ఇదే సందర్భంలో తిరుపతయ్యకు తలకు కుడివైపు రక్తగాయం అయ్యింది. మునిగిన సందర్భంలో కాలు నీటిపై తేలి ఉండడాన్ని కావేరమ్మపేటకు చెందిన సాయిలుగా గుర్తించిన పలువురు బయటికి లాగాడు. తలకు రక్తగాయంతో పాటు ఊపిరి ఆడక మృతి చెందాడని, తన భర్తపై ఎలాంటి అనుమానం లేదంటూ తిరుపతయ్య భార్య విజయలక్ష్మి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

చెరువులో పడి..

మరికల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలంలోని పెద్దచింతకుంట గ్రామానికి చెందిన మల్లేష్ (42) చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీరప్ప, మల్లమ్మ దంపతుల కూమారుడు మల్లేష్, ప్రతి రోజు చెరువులో ఉన్న తామర పూలు తీసుకెళ్లి శివపూజ చేసేవాడు. రోజు మాదిరిగా ఆదివారం ఉదయం పూజకు పూలకని వెళ్లి ప్రమాదవశాత్తుగా చెరువులో పడి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

చికిత్స పొందుతూ..

గండీడ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బెత్తరి లక్ష్మయ్య (54) గత నెల 28న సబ్బ పైన కట్టెలను పెట్టేందుకు మోసుకుంటూ పైకి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో గాయాలయ్యాయి. చికిత్స నిమత్తం గండీడ్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేయించి కోస్గి ఆసుపత్రికి తీసుకవెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చితక్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈనెల 14వ తేదీ రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం మృతిని కొడుకు బెత్తరి బచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవనంపై నుంచి దూకి

వివాహిత ఆత్మహత్య

» భర్త వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపుల కారణంగా మూడు అంతస్థుల భవనంపై నుంచి దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల పట్టణంలోని మాధవరావు కాంపౌండ్‌కు చెందిన అనూష(30)ను మహబూబ్‌నగర్ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆంజనేయులుతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరు జడ్చర్ల పట్టణంలోని ఆజం రైస్ మిల్లు వెళ్లే దారిలోని ఓ భవనంలో ఇల్లు కిరాయికి తీసుకుని ఉంటున్నారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనూష పనిచేస్తుండగా, డ్రైవర్‌గా ఆంజనేయులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. సంసారం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. భర్త వేధింపుల కారణంగా ఉదయం 6గంటల ప్రాంతంలో మూడు అంతస్థుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఊరడి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

మద్దూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపి వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఆదివారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను దంగాన్‌పూర్ శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలిం చినట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నరేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వలస కార్మికుడి మృతి



మృతి చెందిన వలస కార్మికుడు రంజన్ సుహత్

బాలానగర్, జూన్ 15: మండలంలోని పెద్దాయపల్లి రెవెన్యూ శివారులో ఓ దాణా కంపెనీలో బిహార్‌కు చెందిన ఓ వలస కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై లెనిన్ కథనం మేరకు.. బిహార్ రాష్ట్రం చంపారన్ జిల్లాకు చెందిన రాజకుమార్, రంజన్ సుహత్‌లు ఇద్దరు సోదరులు. బతుకు దెరువు నిమిత్తం బిహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చి గత కొన్ని నెలలుగా మండలంలోని పెద్దాయపల్లి శివారులోని ఓ దాణ కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నెల 13న రాత్రి 8గంటలకు కంపెనీలో డ్యూటీ చేసేందుకు వెళ్లాడు. మరుసటి రోజు 14న ఉదయం 8గంటలకు తన గదిలోకి వచ్చి నిద్రించాడు. సాయంత్రం వరకు నిద్ర లేకపోవడంతో సోదరుడు రాజ్‌కుమార్ పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్‌పై దుర్భాషలాడిన మహిళ

» అరగంట పాటు జడ్చర్ల రాణా వద్ద ఆర్టీసీ బస్సు నిలిపివేత

జడ్చర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా ప్రయాణికురాలి నోటి దురుసుతనం కారణంగా బస్సులో ప్రయాణిస్తున్న తోటివారు సుమారు అరగంట పాటు ఇబ్బందులకు గురైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరింది. సుమారు 12గంటల ప్రాంతంలో జడ్చర్ల కొత్తబస్టాండుకు చేరుకుని, మళ్లీ అక్కడి నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరింది. జడ్చర్ల కొత్తబస్టాండులో జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ అదే బస్సులో ఎక్కింది. బస్సు అంతా ఫుల్ ఉండటంతో ఆమె ఫుట్‌బోర్డు వద్ద నిలబడింది. బ్రేక్ వేసిన సందర్భంలో కిందపడే అవకాశం ఉందని, బస్సు లోపలికి రావాలంటూ సదరు మహిళకు బస్సు డ్రైవర్ సూచించారు. దీంతో కోపోద్రిక్తురాలైన ఆమె ఆర్టీసీ డ్రైవర్‌పై దుర్భాషలాడింది. దీంతో మహిళపై ఫిర్యాదు చేసేందుకు దారిలోనే ఉన్న జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. పోలీస్‌స్టేషన్‌లో సైతం సదరు ప్రయాణికురాలు ఆర్టీసీ డ్రైవర్‌తో పాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించింది. ఈ మహిళ కారణంగా సుమారు అరగంట పాటు బస్సు నిలిచిపోవడంతో తోటి ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను వదిలిపెట్టి, ఆ బస్సు కొల్లాపూర్‌కు బయలుదేరింది.

గృహ కార్మికులకు గుర్తింపేదీ?


ఇంట్లో పనిచేస్తున్న వెంకటమ్మ

» దుర్భర స్థితిలో ఇంటి పనివారు » అమలు కాని జీవో నెంబరు 60
» మహబూబ్‌నగర్, వనపర్తి పట్టణాల్లో అధికం
» నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

పాలమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గృహ కార్మికుల ఇళ్లల్లో పని చేసే-డొమెస్టిక్ వర్కర్స్ జీవితం దుర్భరం. సమాజంలో గుర్తింపులేని వారిలో గృహ కార్మికులే అధికం. దంపతులిద్దరూ ఆఫీసులో ఉద్యోగం చేసి అలిసిపోయి ఇంటికి వస్తారు. అలాంటి వారు డొమెస్టిక్ వర్కర్స్‌ను పెట్టుకోవటం మామూలే. ఇళ్లలో వంట, బట్టలు ఉతకటం, బాసండ్లు తోమటం, ఇల్లు ఊడ్చటం, కల్లాపి చల్లటం, చిన్న పిల్లలను ఆడించటం, వృద్ధులకు సేవ చేయటం లాంటి పనుల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ రంగంలో అత్యధికులు వెనుకబడిన ప్రాంతాలకు చెందిన దళిత, బలహీన, గిరిజన వర్గాలకు చెందిన మహిళలే. అతి తక్కువ వేతనాలు తీసుకుని పనిచేయటం, అవమానాలు, నిందలు పాలవుతారు. లైంగిక వేధింపులు, భద్రత లేని జీవితాలు గృహ కార్మికులవి. ఒక ఇంట్లో రోజుకు గంటనుంచి ఐదు గంటల చొప్పున పని చేస్తుంటారు. విశ్రాంతి, సెలవు దినాలు, ఇతర సౌకర్యాలు, హక్కులు పొందలేని స్థితిలో ఉన్నారు. డొమెస్టిక్ వర్కర్స్ ఫోరమ్ ఇండియా(డీడబ్ల్యుఎఫ్ఐ), సీఐటీయూ, టీయూసీఐ, ఇతర సంఘాల ఆద్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాయి. లబ్ధి పొందలేని కొందరు సంఘంగా ఏర్పడి సాధించగలమనే మనోధైర్యాన్ని వారిలో నింపేందుకు కార్మిక సంఘాలు కృషి చేస్తున్నాయి.

● అమలు కాని జీవో

ఇళ్లల్లో పాచీపని చేయటం, కిరాణ వస్తువులు తేవటం, పిల్లలను బడికి తీసుకుపోవటం, తీసుకురావటం లాంటి పనులు చేసేవారికోసం వచ్చినదే జీవో నెంబరు 60. లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ డిపార్ట్‌మెంట్ జీవో 60ని (ఎల్ఏబీ 2) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబరు 1, 2011న విడుదల చేసింది. ఆడ, మగ ఎవరితో ఈ పనులు చేయించుకున్నా నెలరోజులు పాటు రోజూ అరగంట చేస్తే రూ.206, గంటచేస్తే రూ.2747, గంటన్నర చేస్తే రూ.3,608, ఎనిమిది గంటలు చేస్తే రూ.6,700లు తగ్గకుండా ఇవ్వాలని జీవో చెబుతోంది. పనిచేసే వారికి భోజనం, దుస్తులు, రానుపోను చార్జీలు ఇవ్వటం, అది వేతనం కిందకు రాదు. జీవో చెప్పిన దానికంటే ఎక్కువ వేతనం ఇవ్వవచ్చు, కానీ తక్కువ మాత్రం ఇవ్వరాదు. జీవో ప్రకారం తక్కువ వేతనం ఇస్తే యజమానికి రూ.10వేల నుంచి రూ.2వేల వరకు జరిమానా, ఏడాది నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష.... ఒక్కోసారి రెండు అమలు చేసే వీలుంది.

20ఏళ్ల నుంచి ఇదే పనిచేసుకుంటున్న

20ఏళ్ల నుంచి ఇళ్లలో పని చేసుకుంటున్న. యజమానులను గట్టిగా అడగలేం. వారు ఇచ్చినంత, మేము తీసుకున్నంత అన్నట్టుగా ఉంది మా వేతనం. రోజుకు ఒక గంటపాటు పనిచేసుకుని వెళ్లిపోతా. - మౌనమ్మ, గృహ కార్మికురాలు



● బాలలతో పనిచేయించ రాదు



ఇళ్లల్లో బాలకార్మికులతో పనిచేయించటం చట్టరీత్యా నేరం. చిన్నారులు ఇళ్లలో పని చేసే విషయం తెలిస్తే లేబర్ అధికారులకు సమాచారం ఇవ్వండి. మేము పిల్లలను తీసుకువెళ్లి చదువుకునే ఏర్పాటు చేస్తాం. తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 1, 2016నుంచి గృహకార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఆదేశించింది.

- చంద్రశేఖర్‌గౌడ్, డీసీఎల్, మహబూబ్‌నగర్

● లైంగిక వేధింపులు అధికం



ఇళ్లలో పనిచేసే గృహ కార్మికులకు యజమానుల నుంచి లైంగిక వేధింపులు అధికం. వీరికి రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలి. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి.

- కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

● సంఘంతోనే న్యాయం, రక్షణ



సుమారు 30 ఏళ్లనుంచి షాషాబ్‌గుట్ట, ఇతర ప్రాంతాల్లో ఇళ్లల్లో పనిచేస్తుకుంటున్న. నెలకు రూ.50 నుంచి నేడు రూ. 1000 తీసుకుంటున్న. ఒంటరిగా ఉండకుండా కుటుంబానికి ఏదో విధంగా సహాయ పడాలని ఇళ్లల్లో పనిచేస్తున్న.

- వెంకటమ్మ, గృహకార్మికురాలు

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ (మూడు వేలు), వనపర్తి(రెండువేలు)పట్టణాల్లో గృహ కార్మికులు అధికంగా పనిచేస్తున్నట్లు అనధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీరికి డీడబ్ల్యుఎఫ్ఐ అవగాహన కల్పిస్తోంది. పన్నెండేళ్ల నుంచి సర్వేచేసి కార్మికులను గుర్తించే పనిలో ఆ సంఘం ఉంది. గ్రూపులు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహిస్తోంది. ఒక్కరు కాకుండా సంఘంగా యజమాని వద్దకు వెళ్లి తాము చేస్తున్న పనికి వేతనం పెంచుకోవటానికి కృషి చేస్తున్నారు. గతంలో నెలకు రూ.300 ఇస్తుంటే, సంఘం నీడలో నేడు ఐక్యంగా అడిగి రూ.500 నుంచి రూ.2500 వరకు వేతనాన్ని పొందుతున్నారు. కార్మికశాఖ గుర్తింపు కార్డులు అందజేస్తే ఎక్కడ ఎంతమంది కార్మికులు పని చేస్తున్నారనే వివరాలు తెలుస్తాయి.

ధరాఘాతం

» పచ్చిరొట్ట విత్తనాలకు ధరల సెగ » ఒక్క ఏడాదిలోనే భారీగా పెంపు
» ఏటేటా తగ్గుతున్న రాయితీలు » అన్నదాతలకు తప్పని ఆర్థిక భారం


జీలుగ విత్తనాలు

నారాయణపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే తమ ధ్యేయం అని గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు రాయితీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలపై ఈ ఖరీఫ్ సీజన్‌లో రేట్లు విపరీతంగా పెంచింది. విత్తనాల ధరలు పెంచి రాయితీని తగ్గించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో 30 కిలోల జీలుగ విత్తనాల ధర రూ. 1,021.50 పైసలు, జనుములు 40 కిలోల ధర రూ. 1,062, పిల్లి పెసర 20 కిలోలకు 974 రూపాయలు పెంచింది. ఈ ఐదేళ్ల కాలంలో 30 కిలోల జీలుగ ధర రూ.1576, జనుములు 40 కిలోలు రూ. 1580.80 పైసలు, పిల్లి పెసర 20 కిలోలు రూ.1479 ప్రకారం పెరిగాయి. గత ఏడాది 2024 ఖరీఫ్‌లో జీలుగ 30 కేజీల బస్తా రూ. 1,116 ఉండగా ఈసారి రూ. 2,137.50 పైసలు పెరిగింది. జనుములు 40 కిలోల బస్తా గత ఏడాది రూ. 1448 ఉండగా ఈసారి రూ.2510కి పెరిగింది. పిల్లి పెసర 20 కేజీలు గత ఏడాది రూ. 1,084 కాగా, ఈ ఏడాది 2,058కి పెరిగింది. కేవలం ఏడాదిలో అధికంగా ధరలు పెరగడంతో పాటు సబ్సిడీ గత ఏడాది 60 శాతం అందిస్తే ఈ ఏడాది కాస్తా సబ్సిడీ 50 శాతానికి ఇస్తున్నారు. సబ్సిడీ సైతం పది శాతం తగ్గింది. ఆర్థిక భారం అవుతుందని రైతాంగం ఆందోళన చెందుతుంది.

పచ్చిరొట్ట ఎరువుల సాగు

జిల్లాలో ఏటేటా రైతులు భూమికి సారవంతమైన పచ్చిరొట్ట విత్తనాలు విత్తుతూ కరిగెటలో కలియదున్నుతూ భూమి సారవంతం అయ్యేలా దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో జీలుగ విత్తనాలు రైతులు సాగు చేసేందుకు పొందిన విత్తనాల విషయానికి వస్తే 2019లో 689 క్వింటాళ్లు, 2020లో 969 క్వింటాళ్లు, 2021లో 1255 క్వింటాళ్లు, 2022లో 1480 క్వింటాళ్లు, 2023లో 1695 క్వింటాళ్లు, 2024లో 1770 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పొందిన రైతులు సాగు చేస్తూ వచ్చారు. ఇలా ఏటేటా పచ్చిరొట్ట విత్తనాలు పొంది రైతులు సాగు చేసేందుకు ఆసక్తి కనబర్చున్నారు.

జీలుగ విత్తనాలు 30 కేజీలు రెండున్నర ఎకరాల్లో సాగు చేసి 45 రోజుల అనంతరం ఏపుగా పెరిగిన పంటను కరిగేటలో కలియదున్నడం వల్ల భూమిలో చౌడు శాతం తగ్గి డీఏపీ వినియోగం తగ్గించుకొని సారవంతంతో పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెప్పుకొస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఖరీఫ్ వానాకాలం సాగు కోసం జీలుగ విత్తనాలు 2000 క్వింటాళ్లు, జనుము విత్తనాలు 400 క్వింటాళ్లు రైతుల కు అందుబాటులో వ్యవసాయ శాఖ ఆగ్రోస్ కేంద్రాల్లో ఉంచడంతో రైతులు కొనుగోలు చేసి సాగుపై దృష్టి సారించారు.

విద్వేషాలు, ఉద్రిక్తతలే మోదీ ఆయుధాలు

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

పాన్‌గల్/వనపర్తి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్వేషాలు ఉద్రిక్తతలే ప్రధాని నరేంద్ర మోదీ ఆయుధాలని, బీజేపీ పాలనలో దేశ ప్రతిష్ట దిగజారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిందన్నారు. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కల్తీ విత్తనాలను అరికట్టాలని, రైతులకు ఎరువులను సబ్సిడీపై అందించాలని కోరారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు చెప్పినా వినకుండా కొనసాగిస్తున్న కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా పార్టీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని, అందుకు పార్టీ కార్యకర్తలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, వెంకటయ్య, మహబూబ్ పాషా, ఆది, నాయకులు వేణుగోపాల్, దేవేందర్, వెంకటేశ్, రాజేందర్ గౌడ్, రాము, భగత్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం తీవ్రంగా పెరిగిపోతోంది

సమాజం సంక్షోభాల బారిని పడి పేదరికం తీవ్రంగా పెరిగిపోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట మండలాల పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో పెట్టుబడిదారి సమాజం సంక్షోభంలో 2008 నుంచి కొనసాగుతుందన్నారు. అనంతరం భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర-సీపీఎం విశిష్టత అనే అంశంపై సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు తరగతిని బోధించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, లక్ష్మి, కురుమయ్య, గంధం మదన్, గట్టయ్య, బీసన్న, బాలస్వామి, ఉమా, నందిమల్ల రాములు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పేరు తేవాలి

● రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బీఎస్ ఆనంద్
● సౌత్‌ఆఫ్రికా టీసీఏ టీ-20 సీరీస్‌కు జిల్లా వాసి


ఎండీ ఖయ్యూం

గద్వాల అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌ఆఫ్రికాలోని టాంజానియా క్రికెట్ అసోసియేషన్ తరఫున టీ-20 సీరీస్‌కు ఎంపికైన జిల్లావాసి ఎండీ ఖయ్యూం అక్కడ రాణించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తేవాలని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బీఎస్ ఆనంద్ అన్నారు. ఆదివారం గద్వాల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు, గద్వాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రకుమార్‌లు క్రీడాకారుడిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్‌ఆఫ్రికాలో రెండు నెలల పాటు జరిగే కార్వాన్స్-టీ20 క్రికెట్ సీరీస్‌కు గద్వాలకు చెందిన ఎండీ ఖయ్యూం టాంజానియా క్రికెట్ అసోసియేషన్ తరఫున ఎంపిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. గతంలో ఖయ్యూం గద్వాల తరఫున జాతీయ స్థాయి పోటీల్లో ఆడిన ఘనత దక్కిందన్నారు. సౌత్‌ఆఫ్రికాలో రెండు నెలల పాటు జరిగే టీ-20 సీరీస్‌లో మంచి ఆటతీరును కనబరిచి జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ వెంకటేష్, ప్రభు త్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హరిబాబు, హుసేన్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి
» ఘనంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సన్మాన సభ


టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్యను, ఆయన తల్లిని సన్మానిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని చేసి చూపిస్తున్న ప్రభుత్వం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కల్యాణ మండపంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నందిమల్ల యాదయ్య సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పదవి చేపట్టిన తరువాత మొదటిసారి పట్టణానికి వచ్చిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి ఘనంగా స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ...దేశంలోనే మొదటిసారి కులగణన పూర్తి చేసి ముస్లింలతో కలుపుకుని బీసీలు 52 శాతం ఉన్నారని ప్రకటించిన ప్రభుత్వం తెలంగాణ అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దమని పిలుపునిచ్చారు. అందరి అభిప్రాయాల మేరకే పార్టీ కోసం కష్టపడ్డవారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు ఉదాహరణే నందిమల్ల యాదయ్యకు దక్కిన గౌరవమన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, ఏబీసీ హెల్త్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, ధనలక్ష్మి, కదిరె రాములు, శంకర్‌రావు, చీర్ల జనార్ధన్, కిరణ్‌కుమార్, కోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం

» వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అలంపూరుచౌరస్తా, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంలో అన్ని వర్గాల కోసం పోరాటం చేసిందని, ఎన్నో వర్గాలకు, పేదవారికి ఎన్నో పథకాలు వచ్చేలా కృషి చేశామని వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే విజయుడు, తెలంగాణ డీఐజీ బి.సుమతితో కలిసి ఉండవల్లి మండలం, కలుగొట్లలో మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అంతకుముందు ఆయన అలంపూరు చౌరస్తా నుంచి ర్యాలీతో కలుగొట్లకు చేరుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. 1845-50 మధ్యలోనే మహిళల కోసం పాఠశాల స్థాపించినన మహనీయుడు పూలే అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వర్గీకరణ కోసం పోరాడిందని, ఈ పోరాటంలో పలు ప్రభుత్వాలు పలు దఫాలలో ప్రవేశపెట్టిన బిల్లులన్నీ ఏకగ్రీవంగా ఆమోదించపడ్డాయని గుర్తు చేశారు. అంతకు ముందు ఐజీ సుమతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కొంత వరకే చదివించి అనాదిగా వస్తున్న వ్యవసాయం, కులవృత్తుల పనులకు పంపిస్తుంటారని, అలా కాకుండా అందరూ పూర్తిగా చదవాలని కోరారు. నా సొంత గ్రామంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కులం, మతం లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పూలే ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు.

అప్పుడే పుట్టిన ఆవు దూడ కుక్కల పాలు

- అయిజలో విషాదకర సంఘటన


అయిజ బస్టాండులో దూడకు జన్మనిచ్చిన ఆవు

అయిజ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అయిజలో హృదయ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అపుడే జన్మించిన ఆవు దూడ కుక్కల పాలయ్యింది. అయిజ పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో రోడ్డు ప్రక్కన శనివారం రాత్రి వీధి ఆవు దూడకు జన్మనిచ్చింది. అప్పటికే కాచుకు కూర్చున్న కుక్కలు చిన్న ఆవుదూడను పీక్కు తిన్నాయి. లేవలేని స్థితిలో ఆవు, నడవలేని స్థితిలో దూడ ఉండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం ఈ సంఘటనను చూసిన జనం అయ్యో పాపం అనుకున్నారు. సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారే తప్ప సహాయం చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఇంటర్వ్యూ..

వనమహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- కృష్ణయ్య, ఎంపీడీవో, ఊర్కొండ



ఊర్కొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే మొక్కలు నాటడానికి అనువైన ప్రదేశాలను ఎంపిక చేశారని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

మండలంలో నర్సరీలు ఎన్ని, వాటిల్లో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు ?

మండలంలో 16 నర్సరీలు ఉన్నాయి. అందులో గతసంవత్సరం మిగిలిన మొక్కలు, ప్రస్తుతం పెంచిన మొక్కలు మొత్తం 1 లక్ష 38 వేలు కాగా అందులో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం 89 వేల మొక్కలను నాటుతాం. అదేవిధంగా గ్రామాల్లో కుటుంబాలకు 38 వేల మొక్కలను అందజేస్తాం.

అక్కడక్కడా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటుతున్నారని విమర్శ ఉంది?

విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుంటూ మొక్కలు నాటుతాం. ఈ వనమహోత్సవంలో అటువంటి పరిస్థితి ఉండదు. మేము మొక్కలు నాటిన తర్వాత విద్యుత్ స్తంభాలు పాతితే కఠిన చర్యలు తీసుకుంటాము.

మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని?

మండలంలో 279 ఇందిరమ్మ గృహాలు మంజూరు కాగా అందులో 254 అనుమతులు వచ్చాయి. మిగతా వాటికి సాంకేతికంగా సమస్యలు రావడంతో వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాము. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్నాము.

న్యూస్ బాక్స్

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

అచ్చంపేటటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి మునిసిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొనాలని కోరారు.

నేడు శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం

చారకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కల్వకుర్తిలో విలేకర్లతో మాట్లాడారు. అన్నదాతల కోసం రైతు భరోసా నిధులను ఒకేసారి విడుదల చేయడానికి ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఒకేసారి ఎకరాకు రూ.12వేల చొప్పున పెట్టుబడి సాయం ఇవ్వాలనే నిర్ణయం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లా మంత్రులు కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ చొరవ తీసుకోవడంతో త్వరలోనే జిల్లాలో 85 వేల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ కానున్నాయన్నారు. రైతుల పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు

ఉప్పునుంతల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేజీబీవీ పాఠశాల, కళాశాలలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో సైద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, నర్సింగ్ సబ్జెక్టులు బోధించేందుకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి అనుభవం కలిగిన అభ్యర్థులు 17 వరకు ఉప్పునుంతల పాఠశాల, కాలేజీలో దరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు.

26న కంటి ఆపరేషన్ శిబిరం

కందనూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలోని గది నెంబరు 102లో కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి అందులో అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొరగల వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మహబూబ్‌నగర్ ఏనుగొండ లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా ఏనుగొండకు పంపనున్నట్లు తెలిపారు.రోగులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డు ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ, ఫోన్ నెంబరును తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో దోమల విజృంభణ
- నిధుల లేమీతో సాగని పనులు
- అక్కడక్కడా అప్పులు చేసిన పంచాయతీ కార్యదర్శులు

ఊర్కొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 16నెలలు అయ్యింది. ప్రత్యేక అధికారులు కొనసాగుతున్నప్పటికీ పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నర్సంపల్లి గ్రామంలో తాగు నీరు సమస్యను తీర్చలేక పోతున్న అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతు న్నారు. ఇప్పప హాడ్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నిమ్మకునీ రెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా బొమ్మరాజుపల్లి గ్రామంలో తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ జామ్ కావడంతో గ్రామస్థులే వాటిని సరిచేసుకున్నారు. ఊర్కొండపేట, ఊర్కొండ, రేవల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో చేయకపో వడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిధుల లేమీతో సాగని పనులు

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నా నిధుల లేమితో ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు దొరికిన చోట అప్పులు తీసుకువచ్చి కొంతమేరకు సమస్యల పరిష్కారం చేసినా అవి ఏమాత్రం సరిపోవడంలేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చెల్లించాల్సిన ట్రాక్టర్ కిస్తులు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, వీధి దీపాల కరెంటు బిల్లులు ప్రతీ నెల చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిధులు రాక.. అప్పులు చెల్లించలేక

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు రాక, చేసిన అప్పులు చెల్లించలేక విధి నిర్వహణలో రోజూ నరకం అనుభవిస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఇంటి పన్నులు, నల్లా ట్యాక్సులు వసూలు చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేసిన డబ్బులు కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదని పలువురు అధికారులు అంటున్నారు.



ఊర్కొండపేటలో రహదారి పక్కన పడేసిన చెత్త

సమస్యలు పరిష్కారం కావడం లేదు



గ్రామాల్లో పాలన 16 నెలల నుంచి పడకేసింది. ఏ అధికారికి తమ సమస్యలు చెప్పుకున్నా పరిష్కారం కావడం లేదు. కనీసం తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నాము. అంతే కాకుండా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లేదు. వీధి దీపాలు వెలగడంలేదు. పంచాయతీ కార్యదర్శులకు మొరపెట్టుకున్నా మేము ఏమీ చేయ లేమంటూ చేతులు దులుపుకుంటున్నారు.

- దుబ్బ మైసయ్య, ఇప్పపహాడ్

రెగ్యులర్‌గా పర్యటిస్తున్నాం

ప్రత్యేకాధికారుల పాలనలో రోజు వారీగా గ్రామాల్లో పర్యటిస్తూ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాము. అక్కడక్కడా కొన్ని ఇబ్బందులున్నా వాటిని పరిష్కారం చేస్తున్నాము. గ్రామాల్లో తీవ్రమైన సమస్యలు ఉంటే పరిష్కారానికి కార్యదర్శులను పురమాయిస్తున్నాం. వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. తాగునీరు, వీధిలైట్ల మరమ్మతులు ఉంటే వెంటనే చేయిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే మరింతా అభివృద్ధి చేసి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతాము.

- కృష్ణయ్య, ఎంపీడీవో, ఊర్కొండ

పలు మార్కెట్లకు చైర్మన్‌లు ఖరారు

- కొల్లాపూర్, పెంట్లవెల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శ్రీదేవిగౌతంగౌడ్
- పెద్దకొత్తపల్లి మార్కెట్ చైర్మన్‌గా దండు నరసింహ
- వీపనగండ్ల మార్కెట్ చైర్మన్‌గా సుదర్శన్‌రెడ్డి



కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శ్రీదేవి గౌతంగౌడ్



పెద్దకొత్తపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దండు నరసింహ



వీపనగండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుదర్శన్‌రెడ్డి

కొల్లాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల మార్కెట్‌లకు చైర్మన్‌లు నియమితులయ్యారు. కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పట్టణ మాజీ సర్పంచ్ మాజీ, మునిసిపల్ కౌన్సిలర్ శ్రీదేవి గౌతంగౌడ్ పేరుకు రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతి, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం ఖరారు చేశారు. గతంలో కొల్లాపూర్ నియోజకవర్గానికి ఒకే మార్కెట్ కమిటీ పాలక మండలి ఉండేది కానీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి సహకారంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో 5 మార్కెట్ పాలకమండళ్లను ఏర్పాటు చేశారు. అందులో కొల్లాపూర్, పాన్‌గల్, పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల, కోడేరు మండలాలను మార్కెట్ కమిటీ పాలకమండళ్లుగా ఏర్పాటు చేశారు. ఇందులో కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో జనరల్ లేడీకి చైర్మన్ స్థానం రిజర్వ్ కావడంతో బీసీలలో బలమైన మహిళ నేతగా పేరు గాంచిన, పాలనపై పట్టున్న నాయకురాలిగా శ్రీదేవిగౌతంగౌడ్‌కు ప్రత్యేక గుర్తింపు. దివంగత మాజీ సర్పంచ్ బీసీ నాయకుడిగా పేరు గాంచిన గౌతంగౌడ్ భార్య కావడం విశేషం. ఈమె పెంట్లవెల్లి మండలం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కూడా వ్యవహరిస్తారు. అదే విధంగా పెద్దకొత్తపల్లి మండలంలో జూపల్లి అనుచరునిగా మంచి వాగ్ధాటిగా పేరు గాంచిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహ పెద్దకొత్తపల్లి మండలం మార్కెట్ చైర్మన్‌గా మంత్రి జూపల్లి కృష్ణారావు పేరు ఖరారు చేశారు. పెద్దకొత్తపల్లి మండలం మార్కెట్ కమిటీ పాలక మండలి బీసీ జనరల్ కోటాలో దండు నరసింహకు అవకాశం కల్పించడంతో ఆ సామాజిక వర్గం ప్రజలు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీపనగండ్ల మండలం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొల్లారం గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి పేరును మంత్రి జూపల్లి ఖరారు చేశారు. ఈయన గతంలో కూడా కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రైతుల ఉన్నారు. అప్పుడు అవకాశం దక్కలేదు. ప్రస్తుతం వీపనగండ్ల మార్కెట్ కమిటీ జనరల్ కేటగిరిలో సుదర్శన్‌రెడ్డికి చైర్మన్‌గా అవకాశం దక్కింది. ఇదిలా ఉండగా మిగిలిన పాన్‌గల్ మండ లంలో ఎస్సీ జనరల్ రిజర్వ్ కావడంతో కోడేరు మండలంలో జనరల్ లేడీ స్థానం రిజర్వ్ కావడంతో ఇక్కడ చైర్మన్ అభ్యర్థుల పేర్లు సోమవారం సాయంత్రం లోపు మంత్రి జూపల్లి ప్రకటించనున్నారని తెలిసింది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాల ప్యాకెట్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయించి, రైతులను మోసగిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ నిర్వహణ, రికార్డులను, ఎరువుల బస్తాల లాట్ నెంబర్లు, సోర్స్ సర్టిఫికెట్లతో ధరలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ప్రభుత్వం ద్వారా ఆమోదం పొందిన దుకాణాలలో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు సమయంలో రశీదులు తప్పనిసరిగా తీసుకొని పంట చేతికొచ్చినంత వరకు రశీదులను రైతులు భద్రపరుచుకోవాలన్నారు. గ్రామాల్లో రైతుల దగ్గరకు వెళ్లి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై గట్టి నిఘాపెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన పద్మశాలీలు

అచ్చంపేట : స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ టీపీసీసీ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం పద్మశాలి సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పులిజాల శ్రీనివాసులు, పద్మశాలి సంఘం నాయకులు కోటికిశోర్, రవీందర్, శకుంతల, గీత, హైమావతి, యాదగిరి, సత్యనారాయణ, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్

- కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జూన్15 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణాన్ని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహ కారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తామని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ అన్నారు. పట్టణంలోని 20, 21వ వార్డులు ఇందిరానగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ భూమి పూజచేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తుందని ఆయన తెలిపారు. పట్టణంలో ప్రజలకు మౌలికవసతులు కల్పించడానికి సీసీరోడ్లు, డ్రైనేజీల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జమ్ముల శ్రీకాంత్, నాయకులు చిన్న, మబ్బు రామరాజు, శేఖర్, జగన్, ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్, రాహుల్, శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్, జగన్ ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలే ప్రధానం



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

- ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి
- పట్టణ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

తెలకపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ప్రధానమని మండల విద్యాశాకాధికారి సి. శ్రీనివాస్‌రెడ్డి, తెలకపల్లి సింగిల్ విండో డైరెక్టర్ ఉంద్యాల రాజమహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పట్టణ స్థాయి బ్యాండ్మింటన్ పోటీలను కేఎల్‌ఆర్ గార్డెన్స్‌లో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, క్రీడల వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం ఏర్పడుతాయని అన్నారు. ఆరు టీంలు పాల్గొన్నాయని, విజేతలకు బహుమతులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

నీట్‌లో సీటు సాధించిన తాండ్ర విద్యార్థి



నీట్‌లో సీటు సాధించిన ప్రసన్నకుమార్

కల్వకుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ నీట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చారు. నీట్‌లో 465 మార్కులు సాధించి ఎస్సీ కేటగిరిలో 3455 ర్యాంకు సొంతం చేసుకున్నారు. ప్రసన్నకుమార్ 5 నుంచి 10వరకు కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీనగర్ గురు కులంలో విద్యనభ్యసించగా ఇంటర్ హైదరాబాద్‌లో ని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివారు. శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రసన్న కుమార్ సత్తా చాటారు. ప్రతిభ కనబర్చిన ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



రైతులను సన్మానిస్తున్న వాసవిక్లబ్ నాయకులు

కల్వకుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వాసవీక్లబ్ సేవలను కొనసాగించాలని వాసవి క్లబ్ నాయకులు సరాబ్ అనంతం, కొత్ర శ్రీనివాసు అన్నారు. వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో డమ్ టు డస్క్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు రాఘువేందర్, కార్యదర్శి కోటేశ్వర్, వాసవీక్లబ్ వైస్ గవర్నర్ కలిమిచెర్ల రమేష్, జాయింట్ ట్రెజరర్ సత్యం, జాయింట్ సెక్రటరీ శంకర్, జోన్ చైర్మన్ శ్రీనివాసులు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మి, వనిత క్లబ్, వాసవీక్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కరెంట్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- రజక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు లట్టుపల్లి సాయిలు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

వంగూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రజకులకు ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రజక సంఘం మండల గౌరవ అధ్యక్షుడు లట్టుపల్లి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వంగూరులో రజక సంఘం ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాకు మద్దతుగా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా రజకులకు ఇస్తున్న ఉచిత కరెంట్ పథకం బిల్లులు రూ. 187 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిల్లులు చెల్లించాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఉచిత కరెంట్ పెండింగ్ బిల్లుల సాధనకోసం ఈనెల 17న ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాకు మండలంలోని రజకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుమన్, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

ఐతోల్‌లో చినుకు పడితే చిత్తడే



ఐతోల్ గ్రామంలో నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపైనే మల్లుకున్న వర్షపు నీరు

తాడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతోల్ గ్రామంలో నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారి పక్కన మురికి కాల్వలు లేకపోవడం మూలంగా వర్షం కురిసిందంటే చాలు రహదారిపై నీరు మల్లుకుని రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. చిత్తడిగా మారడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు మరింతగా అభివృద్ధి చేపట్టి, మురికి కాల్వలను అభివృద్ధి చేసి వర్షపు నీరుమల్లుకునే సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు. అదే విధంగా రహదారి వెంట డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా రహదారిపైనే మల్లుకుంటుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

నేడు రైతు వేదికల్లో రైతులతో ముఖాముఖి

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తాడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఇంద్రకల్, సిర్సవాడ, అల్లాపూర్ గ్రామాల రైతు వేదికల్లో నేడు మంగళవారం రైతులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడుతుందని మండల వ్యవసాయ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని వారు కోరారు.

రైతులు పాల్గొనాలి

తిమ్మాజిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నేడు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మండల వ్యవసాయ ధికారి కమల్‌కుమార్ అన్నారు. మండలంలోని మారేపల్లి, కోడుపర్తి, తిమ్మాజిపేటల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా ద్వారా అందించే ఎకరాకు ఆరు వేల రూపాయల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు వేదిక వద్ద సకాలంలో చేరుకుని తమకున్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొనాలి

కోడేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తారని, రైతులు తప్పక పాల్గొనాలని వ్యవసాయ విస్తరణాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమం మండల కేంద్రంతో పాటు నర్సాయిపల్లి, జనుంపల్లి రైతు వేదికల ఆవరణల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమంలో పాల్పంచుకోవాలని ఆయన కోరారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మారేడు శివశంకర్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మారేడు శివశంకర్

కందనూలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17న హై దరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కా ర్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐ టీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. జిల్లా కేంద్రం లో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కౌన్సిల్ సమావేశం సిద్దేశ్ విజయ్ మేస్త్రీ అధ్యక్షతన నిర్వహిం చారు. శివశంకర్‌తోపాటు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాగ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మికవర్గానికి తీరని అన్యాయం చే స్తోందన్నారు. జూలై 9న జరిగే జాతీయ సమ రాన్ని విజయవంతంగా చేసి కేంద్ర ప్రభుత్వా నికి బుద్ధి చెప్పాలని కోరు. ఈ నెల 17న జరిగే కమిషనర్ కార్యాలయం ముందు ధర్నాను విజ యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సిద్దేశ్ విజయ్ మేస్త్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయ కులు గొర్ల సత్యం, బత్తుల శివ శంకర్, నాయ కులు లింగం మేస్త్రీ, లక్ష్మయ్య మేస్త్రీ, రాములు మేస్త్రీ, నాగయ్య మేస్త్రీ తదితర మేస్త్రీలు పాల్గొన్నారు.